ప్రజాశక్తి
మంగళవారం 10 సెప్టెంబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కన్నీటి వాన

మునగపాక మండలంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

- అనకాపల్లి జిల్లాలో వేల ఎకరాల్లో నీట మునిగిన వరి
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- జలాశయాల్లోకి పెరుగుతున్న వరద
- లోతట్టు ప్రాంతాల ప్రజల్లో భయాందోళన
- విశాఖ కొండవాలు ప్రాంతాలు గజగజ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, విలేకరుల యంత్రాంగం

ఉమ్మడి విశాఖలో వర్షం కన్నీటినే మిగిల్చింది. ముఖ్యంగా అనకాపల్లి జిల్లాలో మూడ్రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట పొలాలు నీటమునిగాయి. అనేక రహదారులు దెబ్బతిన్నాయి. రైవాడ జలాశయంలోని మత్స్యకారుల వలలు కొట్టుకుపోయాయి. ప్రాథమిక అంచనా ప్రకారం 4,420 మంది రైతులకు చెందిన 3,820 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక సమర్పించింది. ఉద్యాన పంటలకు సంబంధించి మునగపాకలో 15 ఎకరాల కొబ్బరితోట, 10 మండలాల్లో ఐదెకరాల కూరగాయల పంట నీటమునిగింది. పంట పొలాల్లో చేరిన నీరు పోయాకగానీ పంట నష్టం నిర్ధారించలేమని అధికారులు చెబుతున్నారు. జలాశయాలు, లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట పొలాల్లో నీరు ఎక్కువగా చేరింది. మాకవరపాలెం మండలం జి.కోడూరులో తాచేరు గెడ్డ ఉధృతికి గండిపడి వరి పొలాలు నీటమునిగాయి. శారద, వరహా నదులు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. జలాశయాలు దాదాపు వాటి పూర్తి నీటినిల్వ సామర్థ్యానికి దగ్గరగా చేరడంతో పై నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని బట్టి గేట్ల నుంచి కిందకు నీరు వదులుతున్నారు. తాండవ జలాశయాన్ని నీటిపారుదలశాఖ ఇఇ నాయుడు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

తాండవ జలాశయంలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. సోమవారం తాండవలోకి 8,700 క్యూసెక్కుల నీరు చేరింది. జలాశయాల కుడి, ఎడమ కాలువలకు విడిచిపెట్టే నీరు కంటే గేట్ల ద్వారా విడిచిపెట్టిన నీరు ఎక్కువగా వుంది. గేట్ల ద్వారా 8,766 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టగా, రెండు కాలువల ద్వారా 135 క్యూసెక్కుల నీరు మిగతా 2లో..

అనకాపల్లి జిల్లాలో జలాశయాల నీటి నిల్వలు

జలాశయం	పూర్తి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
తాండవ	380.00	379.20 (అడుగుల్లో)
రైవాడ	114.00	111.54 (మీటర్లలో)
కోనాం	101.25	98.25 (మీటర్లలో)
పెద్దేరు	137.00	135.85 (మీటర్లలో)
వరహా	460.00	459.10 (అడుగుల్లో)

పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులను పరామర్శిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

తాండవ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నీటి పారుదలశాఖ అధికారి నాయుడు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి : సిపి

వార్త 4లో..

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి

వార్త 2లో..

కైలాసగిరిపై అదుపు తప్పిన బస్సు

వార్త 3లో..

కామన్‌వెల్త్ యూత్ చెస్ ఛాంపియన్ షిప్‌లో..

అఖిల్ ప్రసాద్‌కు రజత పతకాలు

పతకాలతో అఖిల్ ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన గారపాటి అఖిల్ ప్రసాద్ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు శ్రీలంకలో జరిగిన కామన్‌వెల్త్ యూత్ చెస్ ఛాంపియన్ షిప్‌లో అండర్ - 12 ఓపెన్ విభాగంలో రాపిడ్, క్లాసికల్ ఫార్మాట్లలో రెండు రజత పతకాలను కైవసం చేసుకున్నాడు. క్లాసికల్ విభాగంలో మొత్తం 24 మంది చిన్నారులు పాల్గొనగా మాస్టర్ అఖిల్ ప్రసాద్ 6.5 పాయింట్లను సాధించి రెండో స్థానంలో నిలిచాడు. 1897 ప్రారంభ రేటింగ్‌పై 20 పాయింట్లు లాభపడ్డాయి. రాపిడ్ విభాగంలో మొత్తం 31 మంది ఆటగాళ్లు పాల్గొనగా మాస్టర్ అఖిల్ ప్రసాద్ 5.5 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. 1582 ప్రారంభ రేటింగ్‌పై 79.2 పాయింట్లు దక్కాయి. అఖిల్ ప్రసాద్ ఆసక్తిని గమనించి చిన్నతనం నుంచీ తలిదండ్రులు డాక్టర్ గారపాటి శ్రీధర్, శ్రీలక్ష్మి చైతన్యలు ప్రోత్సహించారు. సీనియర్ చెస్ కోచ్ బి.రమణబాబు చెస్ క్రీడలో మెళకువలు నేర్పించి ప్రతిభావంతునిగా తీర్చిదిద్దారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మిగతా 2లో..

నేడు 'ఉక్కు' రక్షణకు

రాస్తారోకోలు

- జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి సామర్థ్యంలో ఉత్పత్తి చేయాలని, అవసరమైన ముడుసరుకును కేటాయించాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్మికులు, ప్రజలు అందుకు సిద్ధమవుతున్నారు. పిలుపులో భాగంగా మంగళవారం విశాఖ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో, పరిశ్రమల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నుంచి అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ మిగతా 2లో..

విజయవాడ వరద బీభత్సం ప్రభుత్వ వైఫల్యమే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రస్తుత విజయవాడ వరద బీభత్సం ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని రాష్ట్ర మాజీ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సోమవారం విశాఖ నగరంలోని లాసన్స్ బే కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన పది రోజులుగా విజయవాడ వరదలు, మంపులో 45 మంది ప్రాణాలు కోల్పోయారని, వాటిని తాము రాజకీయ హత్యలుగానే పరిగణిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నడిబొడ్డున విజయవాడ ప్రాంతంలో అంతపెద్ద ఎత్తున వరద వస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును ప్రజలు విమర్శిస్తున్నారని తెలిపారు. ఇటువంటి సమయాల్లో ప్రజల అవస్థలను పక్కనపెట్టి పూటకో ప్రెస్‌మీట్ పెట్టి విపత్తును పబ్లిసిటీకి మిగతా 2లో..

పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రేంజ్‌లో విఆర్ విధులు నిర్వహిస్తున్న పలువురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు జారీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగులు పొందిన వారిలో విఆర్ విశాఖపట్నం రేంజ్‌లో పనిచేస్తున్న వానపల్లి నాగరాజును శ్రీకాకుళం జిల్లా ట్రాఫిక్ విభాగానికి, ఎంవివి రమణమూర్తిని విజయనగరం జిల్లా విఆర్‌కు, ఎం.బుచ్చిరాజులును అనకాపల్లి జిల్లా పిసిఆర్‌కు, జి.దుర్గాప్రసాద్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా సెల్‌కు, జిఆర్‌కె తులసీదాస్‌ను శ్రీకాకుళం జిల్లా డిటిసికి, సువ్వరి రామును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్‌కు, ఎస్‌కె గఫూర్‌ను అనకాపల్లి జిల్లా విఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా నర్సీపట్నం టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గంగుల గోవిందరావును విశాఖపట్నం రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

అఖిల్ ప్రసాద్‌కు రజత పతకాలు

ఏడో తరగతి చదువుతున్న అఖిల్ ప్రసాద్‌ను పాఠశాల యాజమాన్యం కూడా ఎంతగానో ప్రోత్సహించింది. దీంతో విశాఖ జిల్లా గర్భపడేలా రెండు రజత పతకాలను అతడు సాధించాడు. అఖిల్ ప్రసాద్‌ను ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.బాబూరావు, కార్యదర్శి ఎస్.మణికంఠరావు, కోశాధికారి ఎస్.ఉమామహేశ్వరరావు, సిఎఓ వి.శ్రీకాంత్ అభినందించారు.

నేడు 'ఉక్కు' రక్షణకు రాస్తారోకోలు

జరుగుతుందన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టనున్నామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే కార్మికుల సంఖ్యను, ఉత్పత్తిని తగ్గించాలని చూస్తోందని తెలిపారు.

విజయవాడ వరద బీభత్సం ప్రభుత్వ వైఫల్యమే

వాడుకోవడం తగదన్నారు. బుడమేరు కాలువ నుంచి వరద పెరుగుతుందని 20 గంటల ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. ఆ ప్రాంతంలో రెండు లక్షల మందిని ఒక్కసారిగా తరలించేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం వల్లే అధికారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉండిపోయారని అన్నారు. అధికారుల సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను, రేషన్ బండ్లను వాడుకుని కూటమి ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం ముందు చూపుతో ఉండబట్టే ఇప్పుడు వరద సహాయక చర్యలు సులభతరం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో ఏదైనా మంచి జరిగితే అది టిడిపి ద్వారా జరిగినట్టు, చెడు జరిగితే అది వైసిపి ద్వారా జరిగినట్టు ప్రభుత్వం ప్రచారం చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనకాపల్లి జిల్లాలో భారీగా పంట నీట మునుగుతుంటే ఒక్క మంత్రి కూడా కనీసం సమీక్ష జరపలేదన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలో ఉన్న అన్ని కొండవాలు ప్రాంతాల్లో తక్షణమే రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు, జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌కు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. జివిఎంసి పరిధిలోని అన్ని కొండవాలు ప్రాంతాలలోనూ ప్రజలు దశాబ్దాల తరబడి లక్షల సంఖ్యలో నివాసముంటున్నారని, గతంలో ఒడిఎ నిధుల ద్వారా ప్రభుత్వం రక్షణ గోడలు, రోడ్లు, కాలువలు, విద్యుత్, మంచినీరు, కమ్యూనిటీ భవనాలు మొదలగు మౌలిక సదుపాయాలు కల్పించి ఈ ప్రాంతాలను కొంత అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ నిర్మాణాలు జరిగి సుమారు 35 సంవత్సరాలు అవుతోందన్నారు. నాటి ఈ నిర్మాణాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని, వర్షాలు పడుతున్న ప్రతి సందర్భంలోనూ పలు ప్రాంతాల్లో రక్షణ గోడలు కూలిపోవడం ప్రాణ, ఆస్తి నష్టం జరగడం పరిపాటిగా మారిందని తెలిపారు. తాజా వర్షాలకు ఆదివారం జివిఎంసి 91వ వార్డు, రామకృష్ణానగర్‌లో గోడ, రహదారి కూలిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో రక్షణ గోడలే లేకపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని కొందరు అధికారులంటున్నారని, కాంట్రాక్టర్ల వాదన మరోలా ఉందని తెలిపారు. వర్క్ టెండర్‌లో వివిధ పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందని, ఆ పనుల వల్ల తమకు నష్టం తప్ప లాభం లేదని, వీటికి తోడు జివిఎంసి నుంచి బిల్లులు సకాలంలో రావటం లేదని, పెట్టుబడికి వడ్డీలు పెరిగిపోతున్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా నిర్మాణాలు జరగక నగరంలోని కొండవాలు ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే కలుగజేసుకొని నగరంలోని అన్ని కొండవాలు ప్రాంతాల్లో పాత రక్షణ గోడలు తొలగించి కొత్తవి నిర్మాణం చేపట్టాలన్నారు. అవసరమైన చోట్ల కొత్తగా రక్షణ గోడలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

డ్రగ్స్ వద్దంటున్న గణనాథుడు !

- తాడిచెట్లపాలెంలో వినూత్నంగా ప్రతిమ ఏర్పాటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాదక ద్రవ్యాల నివారణపై యువతను చైతన్యం చేసేందుకు యువసేవ ఫౌండేషన్ వినూత్నంగా ఆలోచించింది. ఈ క్రమంలోనే మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై యువతను మేల్కొలిపేందుకు తాడిచెట్లపాలెంలో డ్రగ్స్‌ను అణిచివేస్తున్నట్లు దొక్కుతున్నట్లు వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు పీలా హరి ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెబుతూ కౌన్సిలింగ్ ఇచ్చే విధంగా వినాయకుడిని ఏర్పాటు చేశామన్నారు. వారి ఆలోచనను పలువురు అభినందించారు.

కన్నీటి వాన

(మొదటి పేజీ తరువాయి..) విడిచిపెట్టారు. రైవాడకు వచ్చే వరదనీటిని బట్టి కిందకు విడిచిపెట్టే యోచనలో అధికారులు ఉన్నారు. కోనాంకు 500 క్యూసెక్కుల నీరు చేరగా వంద క్యూసెక్కుల నీరు కిందకు విడిచిపెట్టారు. వరహకు వచ్చిన 300 క్యూసెక్కుల నీటిని యథాతథంగా కిందకు విడుదలచేశారు. పెద్దేరుకు వచ్చిన 985 క్యూసెక్కుల్లో 514 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

చీడపీడలు సోకకుండా జాగ్రత్తపడాలి

జిల్లాలో వర్షాలకు నీటమునిగిన వరి పంట దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు తెలిపారు. వర్షం నీరు బయటకుపోయిన తరువాత ఎకరా వరి పొలంలో 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ ఎరువు వేయాలని సూచించారు. 200 గ్రాముల కార్బండిజం 200 లీటర్ల నీటిలో కలిపి చీడపీడలు సోకకుండా ఎకరా వరి పంటకు వేయాలన్నారు.

దెబ్బతిన్న రహదారులు

ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి మండలం కొప్పాక జాతీయ రహదారిపై ఏలేరు కాలువ నీరుచేరడంతో వాహనాలను వన్‌వేలో నడిపారు. మాడుగుల మండలం ఖండివరంలో రహదారి, నర్సీపట్నం నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతో పలు చోట్ల కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. బుచ్చెయ్యపేట మండలంలోని తాచేరు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది.

విశాఖలో ఇలా..

ఎవిపి.కాలనీ : ఇంకా వర్షాలు పడే అవకాశముందన్న హెచ్చరికలతో విశాఖ నగరంలోని కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా భీతిల్లుతున్నారు. పెందుర్తి మండలంలోని మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ స్థితిగతులను విశాఖ పశ్చిమ ఎంఎల్‌ఎ గణబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం పరిశీలించారు. రిజర్వాయర్ నీటి మట్టం 61 అడుగులు కాగా ప్రస్తుతం 57.4 అడుగుల మేర నీరు జలాశయంలోకి చేరిందని అన్నారు. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. అనంతరం రిజర్వాయర్ పరివాహక ప్రాంతాలనూ, గోపాలపట్నంలోని పలు ప్రాంతాలనూ కలెక్టర్ సందర్శించారు. భారీవర్షాల కారణంగా మేఘాద్రి గెడ్డ జలాశయంలోకి నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, ఈత కోసం రిజర్వాయర్‌కు ఎవరూ వెళ్లొద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

53 మంది పునరావాస కేంద్రాలకు తరలింపు

విశాఖ నగరంలో వర్షాలు పడుతున్న దృష్ట్యా కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని, ప్రస్తుతం 53 మందిని జివిఎంసి ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించామని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి సోమవారం తెలిపారు. ఎడతెరపిలేని వర్షం కారణంగా ఎనిమిదో జోన్ 91వ వార్డు పరిధిలోని రామకృష్ణా నగర్ సమీపంలో కొండవాలు రక్షణ గోడ జారినందున ఆ ప్రాంతంలోని 38 మందిని అప్రమత్తం చేసి గోపాలపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో వారికి ఆశ్రయం కల్పించామన్నారు. జోన్-1 తగరపువలస పబ్లిక్ లైబ్రరీలో ఏడుగురికి పునరావాస ఏర్పాట్లు చేశామన్నారు. జోన్ 2 పరిధి 13వ వార్డులో జైభీమ్ నగర్ ప్రాంతంలోనున్న 8 కుటుంబాలకు చెందిన 20 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి వసతితో పాటు భోజనం, తాగునీరు, తదితర అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ముందస్తుగా 80 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని వెల్లడించారు. కాలువలలో, ఎర్రిగెడ్డలో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో జివిఎంసి టోల్ ఫ్రీ నెంబరు 1800 4250 0009ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లూరి జిల్లాలో భారీ వర్షం

ఉగ్రరూపం దాల్చిన వాగులు
కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

కొండ చరియలు విరిగిపడ్డ ప్రాంతమిదే..

మృతురాలు కొర్ర కుమారి (ఫైల్)

అల్లూరి జిల్లా విలేకరుల యంత్రాంగం : అల్లూరి సీతారామరాజు జిల్లాలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఏజెన్సీ అంతటా వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పలుచోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. వందలాది గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా సరిహద్దు ప్రాంతాలు చివురుటాకులా వణికిపోయాయి. జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగిపడి ఒకరు మృతిచెందారు. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పలువురిని కలిచివేసింది. ఆదివారం అర్ధరాత్రి వేళ కురిసిన భారీ వర్షానికి కొండ చరియలు విరిగి గ్రామంపై పడ్డాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొర్ర కుమారి (35) కొండ చరియల కింద పడి మృతిచెందింది. కొర్ర పండన్న, కొర్ర సుమిత్ర, కొర్ర సుబ్బారావు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ గ్రామంలో 30 ఇళ్లలో 120 మంది వరకూ జీవిస్తున్నారు. కొండ చరియలు విరిగిపడ్డంతో గ్రామంలోని ఇళ్లన్నీ దెబ్బతిన్నట్టు సమాచారం. గ్రామస్తులు విరిగిపడ్డ కొండ చరియల కింద ఉన్నవారిని కాపాడారు. మృతురాలి కుటుంబానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు.

మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో అర్ధరాత్రి కొండ చరియలు విరిగి పడడంతో మృతిచెందిన కొర్రా కుమారి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరకు - విశాఖపట్నం వచ్చే ఘాట్ రోడ్డులోనూ కొండచరియలు విరిగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపించి సహాయక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. చట్రాపల్లిలో సర్వం కోల్పోయిన వారిని ఆదుకోవాలని, వారిని సురక్షిత ప్రాంతానికి తరలించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
I.A.343/2023 in O.S.345/2013

Between:
1) M/s. Sri Venkateswara Constructions, Rep. by its Managing Partner Sri Garapati Venkateswara Rao
2)Sri Garapati Venkateswara Rao ...Petitioners/Defendants

And:
Smt. Mandala Simhachalam ...Respondent/Plaintiff

NOTICE To,
Smt. Mandala Simhachalam, W/o.Sri Ramu, Hindu, aged 70 years, R/at Indira Nagar-2, Visakhapatnam-530007, Presently Residing staying at Ramamurthy Panthulu Peta, Kancharapalem, Visakhapatnam.

Please take notice and appear either in person or through an Advocate before Hon'ble Court of the II Addl. District and Sessions Judge at Visakhapatnam in I.A.343/2023 in O.S.345/2013 on **24-09-2024** at **10:30 A.M** and file your objections if any failing which the Hon'ble Court will pass an exparte orders against you.

(By Order of the Hon'ble Court)
D.V.V.R. PRATAP,
R. SARADA NAGARJUN,
Advocates,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1147/2021

Between:
INDIAN BANK, Seethammapeta Branch, Visakhapatnam, Rep., by its Branch Manager ...Plaintiff

And:
Merugu Devi & 2 others ...Defendants

SUMMONS

To,
Defendant No.3:
Sri Karri Prudhvi,
S/o. Late Karri Rambabu, Hindu, age not known but major, R/at D.No.4-31,11th Street, Sarada Nagar, Anakapalli-531001.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **25-09-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **25-09-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
G. LAKSHMI RAMBABU,
S. VARALAKSHMI,
Advocates,
Visakhapatnam

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 63/2022 in O.S.847/2016

Between:
దుమ్ము ధనలక్ష్మి ...D.Hr/Plaintiff
And
1) మట్టా రామదాసు
2) మట్టా జ్యోతి ...J.Drs/Defendants

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు ఖర్చులు రాబట్టునిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్థిని తేది. **01-10-2024**న వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. **01-10-2024** ఉదయం గం॥ **10.30** ని॥ల నుండి **సా॥5.00 గం॥**ల మధ్య సమయం లో వేలం వేయుదురు. సదరు వేలంపాట లో పాల్గొన దలచిన ఆసక్తిగలవారు పై తేదిన, పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, ఎగువపేటలో చేరినటువంటి సుమారు 50 చ॥ గ॥ల స్థలములో గల ఆస్థి పన్నునెంబరు 10890 09994 గ్రౌండ్ ఫ్లోర్ నందు ఆస్‌బెస్టాస్ రేకుల ఇల్లు డోర్ నెంబరు 14-15-146/1 గల స్థిరాస్తి ప్రతివాదికి పూర్తి అనుభవం హక్కుగల స్థిరాస్తి హద్దులు: **తూర్పు:** పీరుపల్లి బండయ్య, **దక్షిణం:** మట్టా సత్యం రేకులఇల్లు, **పడమర:** వాసుపల్లి జయమ్మ RCCబిల్డింగ్, **ఉత్తరం:**సందు (రహదారి)

DHR Value: Rs. 5,15,000/-
Amin Value Rs. 8,26,310/-
JDR Value: Not furnished

(By Order of the Hon'ble Court)
V. SURYA PRAKASHA RAO &
T. JYOTHI, Advocates
Visakhapatnam, **Cell: 8328017241**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో..

ఎమ్మెల్యేలు, అధికారుల పర్యటనలు

కొయ్యపేటలో మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు సోమవారం పర్యటించారు. నష్టాలను పరిశీలించారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటించారు. పాండ్రంగిలో గోస్తనీ నది ప్రవాహాన్ని అల్లూరి పార్కు నుంచి పరిశీలించారు. మద్ది సమీపంలోని పల్లిగెడ్డ నీటి ప్రవాహాన్ని, పద్మనాభం నుంచి రెడ్డిపల్లి వరకు ఆర్ అండ్ బి రోడ్డును, పొట్నూరు గ్రామంలో పారుతున్న వర్షపు నీటిని, నేరెళ్లవలస పంచాయతీ కొయ్యపేట గ్రామంలో ప్రమాద స్థితిలో ఉన్న మంచినీటి ట్యాంకును, అదే గ్రామంలో పడిపోయిన పెంకుటిల్లును, గుడ్డువలస పంచాయతీలో ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. అదే గ్రామంలో ఉన్న కృష్ణంరాజు చెరువు గర్భంలో శ్మశాన వాటిక మునిగిపోవడంతో ఎత్తయిన ప్రదేశంలో ఉన్న స్థలాన్ని గుర్తించి ఇవ్వాలని తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు సూచించారు. అదే గ్రామంలో అంబేద్కర్ కాలనీలో పదేళ్లుగా వాడుకలో లేని ప్రాథమిక పాఠశాల భవనం వర్షాలకు కూలిపోయింది. దాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదర, టిడిపి మండల అధ్యక్షులు కె.రమణ, నాయకులు సత్యనారాయణ, నందీశ్వర, జిపివై.నాయుడు, గంగరాజు, రమణ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌ను సోమవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించారు. నీటి ప్రవాహాన్ని పరిశీలించి ముందు జాగ్రత్త చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహం చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని, సందర్శకులను ఎవరిని అనుమతించరాదని ఆదేశించారు. రిజర్వాయర్ గేట్లు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, జెసి మయూర్ అశోక్, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు

ఆనందపురం: మండలంలోని పలు గ్రామాలు జలమయం కావడంతో సోమవారం తహశీల్దార్ శ్యాంప్రసాద్, విఆర్‌ఒలు పర్యటించారు. బంటుపల్లి కల్లాలలో జట్లమకొండ నీరు పోయే గెడ్డలు ఆక్రమణకు గురి కావడంతో నీరు రోడ్డు, ఇళ్ల ప్రాంతాల్లో నిల్వ చేరడంపై ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి స్పందించి తహశీల్దార్ ఆదేశాలతో విఆర్‌ఒ స్వామి, సర్పంచ్ కోట పైడిరాజు, శ్రీను నీరు పోయే విధంగా తాత్కాలిక చర్యలు చేపట్టారు.

శొంఠ్యాం పరిధిలోని ఆబోతువానిపాలెం వెళ్లే గెడ్డ వర్షానికి కొట్టుకుపోవడంతో తహశీల్దార్‌తో కలిసి డిఇ శ్రీనివాసరావు, విఆర్‌ఒ వరలక్ష్మి పరిశీలించారు. అటువైపుగా వెళ్లరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నిండు కుండలా గోస్తనీ

ప్రజాశక్తి -తగరపువలస : భారీ వర్షాలతో గోస్తనీ నిండు కుండను తలపిస్తోంది. విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరడంతో ప్రమాదకర స్థాయికి చేరింది. తాటిపూడి గరిష్ట నీటి మట్టం 297 అడుగులు, ప్రస్తుతం 290.20 అడుగులకు చేరింది. గరిష్ట స్థాయికి మించి ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి వేశారు. దీంతో గోస్తనీ నిండు కుండను తలపిస్తోంది.

వ్యవసాయాధికారుల పరిశీలన

ఆనందపురం : మండలంలోని పొడుగుపాలెం, వెల్లంకి, బోని గ్రామాలలో సోమవారం ఆనందపురం వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ ఆధ్వర్యంలో సిబ్బంది వరి పంటలను పరిశీలించారు. పంటలలో నీటి నిల్వ లేకుండా చూడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది లలిత, దిలీప్, రమేష్, వెల్లంకి గ్రామ రెవెన్యూ అధికారి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి రామకృష్ణనగర్ కొండవాలు ప్రాంతాన్ని, 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు, ఎంపీ శ్రీభరత్ పరిశీలించారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెం శివారు ప్రాంతాలలో పాడైన రహదారిని, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదంగా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపిపి స్కూల్, లక్ష్మీనగర్‌లో ఆశ్రమం పొందుతున్న నిరాశ్రయులను పరామర్శించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

నిర్వాసితులకు సిపిఎం పరామర్శ

గోపాలపట్నం : వర్షాలకు దెబ్బతిన్న రామకృష్ణనగర్ కొండవాలు ప్రాంతంలో సిపిఎం నాయకులు సోమవారం పర్యటించారు. లక్ష్మీనగర్ పాఠశాలలో ఆశ్రయం పొందుతన్న బాధితులను పరామర్శించారు. వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల రక్షణార్థం ప్రతిష్టమైన రిటర్నింగ్ వాల్ నిర్మించాలని కోరారు. సంఘటనా స్థలంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో సిపిఎం నాయకులు మాట్లాడారు. సత్వరమే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలివాడ వెంకటరావు, పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, ఎ.గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాజువాక : పెదగంట్యాడ మండలంలోని పలు కాలనీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ సోమవారం పర్యటించారు. దయాల్‌నగర్, వికాస్‌నగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో పాత భవనాలను, డ్రెయినేజీలను పరిశీలించారు. స్థానిక తహశీల్దార్ ఎల్.రామారావు, సచివాలయ సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. తాటితూరు, టి.నగరపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. ఏ మేరకు నష్టం వాటిల్లినదీ అక్కడే ఉన్న వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. టి.నగరపాలెం, గొల్లలపాలెం శ్రీ రాధాకృష్ణ ఆలయం వద్ద కాల్వ, రక్షణ గోడ నిర్మాణం, పాపారావు ఇంటి నుంచి బోరింగ్ వరకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని కోరుతూ టిడిపి నాయకులు పూసర్ల రామారావు ఎమ్మెల్యే గంటాకు వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నుంచి ఎల్లారమ్మ గుడి వరకు గోస్తనీపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామారావు, డిపిఒ శ్రీనివాసరావు, ఎండిఒ డాక్టర్ వి.జానకి, ఎఇ భాస్కర్, ఎఒ బి.శివకోమలి, పంచాయతీ విస్తరణ అధికారి జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం ప్రాంతంలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

మేఘాద్రి రిజర్వాయర్‌ను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు

మేఘాద్రి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్‌ను విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత నీటిమట్టం 57.4 అడుగులు ఉందని 61 అడుగులు దాటితే ఒక్కొక్క గేటు ఎత్తివేస్తారని తెలిపారు. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరినీ అప్రమత్తం చేశామని చెప్పారు. మేఘాద్రి రిజర్వాయర్‌కు ఎవరు ఈతకు వెళ్లరాదని సూచించారు. ఏవైనా సమస్యలుంటే అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్, జోనల్ కమిషనర్ హేమవతి, ఇరిగేషన్ ఎఇలు, టౌన్ ప్లానింగ్ ఎసిపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జియ్యాని

వేపగుంట : ఇటీవల కురిసిన వర్షాలకు మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం పెరగటంతో రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. రిజర్వాయర్ సిబ్బందిని అడిగి నీటిమట్టం వివరాలు తెలుసుకున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. గోపాలపట్నం కొండవాలు ప్రాంతంలో ప్రమాదకర స్థితిలో ఉన్న ఇళ్లకు చెందిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు పోలీసులు చేశారని ఆయన తెలిపారు. ఎలాంటి విపత్తు ఎదురైనా ఎదుర్కొనేందుకు నగరపాలక సంస్థ అన్నివిధాలా సిద్ధంగా ఉందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి-గాజువాక : లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన జగ్గు సెంటర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పంతులుగారు మేడకు చెందిన మాలకొండ రెడ్డి (70) స్కూటీపై వెనుక కూర్చుని ఉన్నాడు. స్కూటీని కోటేశ్వరరావు నడుపుతున్నాడు. జగ్గుసెంటర్ వద్దకు వచ్చేసరికి గోతిలో వాహనం పడి ఆగిపోయింది. దీంతో వెనుక నుంచి వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. స్కూటీ వెనుక కూర్చుని ఉన్న మాలకొండరెడ్డిని ఢీకొనడంతో ఆయన రోడ్డు మీద పడిపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంభీరం గెడ్డలో మూడు గేదెలు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గంభీరం గెడ్డలో ప్రమాద వశాత్తు మునిగిపోయిన మూడు గేదెలు మృతి చెందినట్లు పశు సంవర్థక శాఖ భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ సోమవారం తెలిపారు. జివిఎంసి నాలుగో వార్డు కె.నగరపాలెం గ్రామానికి చెందిన పాడి రైతు శ్రీనివాసరావుకు చెందిన మూడు గేదెలు మృతి చెందినట్లు వివరించారు. పాలిచ్చే గేదెకు రూ.37,500లు, పడ్డకు రూ.20 వేలు చొప్పున అపత్కార విపత్తు కింద నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మృతిచెందిన గేదెలను దాకమర్రి పశు వైద్యాధికారి డాక్టర్ జి.కాంతికిరణ్, సిబ్బంది పరిశీలించారు.

కైలాసగిరిపై అదుపు తప్పిన బస్సు

18 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరి కొండపై యాత్రికుల బస్సు హ్యాండ్ బ్రేక్ జారి అదుపు తప్పి గోడను ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గోడను ఢీకొట్టి బస్సు ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... చత్తీష్‌ఘడ్‌కు చెందిన సుమారు 18 మంది యాత్రికులు నగరంలో ఉన్న ప్రయివేటు బస్సును బుక్ చేసుకొని కైలాసగిరి కొండపైకి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి కిందికి దిగేందుకు డ్రైవర్ బస్సును లైన్‌లో పెట్టి హ్యాండ్ బ్రేక్ వేసి కిందికి దిగాడు. యాత్రికులు ఒక్కొక్కరు బస్సులోకి వెళ్తున్నారు. ఈ క్రమంలో హ్యాండ్ బ్రేక్ కిందికి జారడంతో బస్సు నెమ్మదిగా కిందకు వెళ్లి పక్కనే ఉన్న గోడకు ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే గాయాలైన ప్రయాణికులను కెజిహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న నగర పోలీసు కమిషనర్ కెజిహెచ్‌కు వెళ్లి గాయాలైన ప్రయాణికులను పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

పిన్నింటి వారి కల్లాలకు రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పిన్నింటి వారి కల్లాలకు 20 సంవత్సరాలుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రహదారి ఏర్పాటుచేయాలని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పిన్నింటి వారి కల్లాల నుంచి హైవేకు వచ్చే రహదారిలో కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించి రోడ్డు లేకుండా చేశారని గ్రామానికి చెందిన డి.శంకర్రావు, అఖిలేష్ యాదవ్, జి.అప్పన్న, కన్నారావు తదితరులు ఫిర్యాదు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి వెంకట రమణ ఇంటి నుంచి వెనుక ఉన్న సుమారు 15 కుటుంబాలకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కనీసం 10 అడుగులు రోడ్డు అయినా ఏర్పాటుచేయాలని విజ్ఞప్తిచేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉపసర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, లక్ష్మి, పి.శ్రీను తదితరులు ఉన్నారు.

రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు

ప్రజాశక్తి-పద్మనాభం : రైతులకు ఆసక్తి ఉంటే 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించనున్నట్లు ఏపిఎంఐపి పీడీ కె.మన్మధరావు తెలిపారు. పద్మనాభం మండలంలోని మద్ది, బాందేవపురం, అనంతవరం, కొవ్వాడ తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న చిన్న కారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందించనున్నట్లు వివరించారు. సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. తుపాను కారణంగా భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఈక్రాపు నమోదుపై ఆయన పరిశీలించారు. మండలంలో 2003 నుంచి 2024 వరకు ఈ క్రాపు నమోదు చేసిన రైతుల జాబితాను మండల వ్యవసాయ శాఖ అధికారులకు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఆయన అందించారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే బాధ్యతపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా నడిపి సెయిల్ విలీనం చేయాలని కోరుతూ సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్, ఒబిసి అసోసియేషన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, కేంద్రం ఆంక్షలతో ప్లాంట్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థ వల్ల వేలాది మంది ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలు ఉపాధి పొందారని గుర్తు చేశారు. ఆయా వర్గాల అభివృద్ధిని, ఎదుగుదలను ఓర్వలేకే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను తెరపైకి తెచ్చారని విమర్శించారు. గత పదేళ్లలో ప్రయివేటు రంగ పరిశ్రమలు, కార్పొరేట్లు తీసుకున్న బ్యాంకు రుణాలు రూ.12 లక్షల కోట్లను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు.

ప్లాంట్‌ను నడపడానికి, ముడిసరుకు కొనుగోలుకు నిధులు లేక ఉత్పత్తిని నిలిపివేసిన యాజమాన్యం గత 15 రోజులుగా ఉత్పత్తిని కనిష్ట స్థాయికి తగ్గించి ప్రమాదకర పరిస్థితులలో నెట్టి మరోపక్క ఉత్పాదకతను పెంపొందించేందుకు, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ఓ సంకల్పంతో ముందు సాగుతున్నామని సిఎమ్‌డి ప్రసార మాధ్యమాలకు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. టర్న్ ఎరౌండ్ ప్లాన్‌ను రూపొందించామని చెబుతూ రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తి నిలిపివేయడం, ఉద్యోగులు, కార్మికుల సంఖ్య కుదింపునకు యత్నించడం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు దాచుకున్న త్రిఫ్ట్ సొమ్మును కూడా కాజేసి వడ్డీ భారాన్ని కార్మికులపై మోపుతున్న సిఎమ్‌డి యాజమాన్యం మాటలను కార్మికులు ఈ ప్రాంత ప్రజలు విశ్వసించడం లేదన్నారు. యాజమాన్య చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, బొండా తౌడన్న, కారు రమణ, బి.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, మోహన్‌బాబు, విళ్ల రామ్మోహన్‌కుమార్, కెవిడి.ప్రసాద్, కాటమ్ చంద్రరావు, పరమట సత్యనారాయణ, దాసరి పుల్లారావు, కెవి.రత్నం, ఫణీంద్రబాబు, కొమ్మునేని శ్రీనివాస్, దాసరి సురేష్, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెవిడి ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఉద్యోగులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులపై పౌర గ్రంథాలయంలో విశాఖ ఉక్కు అధికారుల సంఘం, విశాఖ ఉక్కు ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం, విశాఖ ఉక్కు ఒబిసి ఉద్యోగుల సంఘం, విశాఖ ఉక్కు రిటైర్డ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, ప్లాంట్‌లో 30 వేల శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారని, ఏడాది కాలంగా సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ ఉత్పత్తి నాలుగు మిలియన్ టన్నుల నుంచి 2021లో ఆరు మిలియన్ టన్నులకు పెంచి లాభాల బాట పట్టిందన్నారు. గత మూడేళ్లలో ఏడు మిలిటన్ టన్నుల ఉత్పత్తి లేక రూ.35 వేల కోట్లు టర్నోవర్ నష్టం వాటిల్లిందన్నారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె వల్ల ఉత్పత్తి తగ్గి మూడు వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. స్టీల్ ప్లాంట్ నాన్ స్ట్రాటజిక్ విభాగంలో ఉండడం దురదృష్ట కరమని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్రంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ సమస్యపై చర్చించాలని కోరారు. ఈ సమావేశంలో స్టీల్ ప్లాంట్ రిటైర్డు స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్టూరు శ్రీనివాసరావు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లయ్య, ఒబిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయవాడకు కూరగాయలు తరలిస్తున్న వ్యాపారులు, రైతులు

వరద బాధితులకు కూరగాయలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : విజయవాడ వరద బాధితులకు సహాయ నిమిత్తం సీతమ్మధార రైతుబజార్ రైతులు అందరూ కలిపి రెండువేల కిలోలు కూరగాయలు అందించారని రైతు బజార్ ఈవో కొండబాబు తెలిపారు. రైతులు తమ వంతుగా కూరగాయలు పంపిణీ చేయడం సంతోషకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు బజార్ సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

విశాఖపట్నం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం జ్ఞానాపురం హోల్ సేల్ మార్కెట్, రైతు బజార్ రైతులు సహకారంతో కూరగాయలు, నిత్యవసర వస్తువులను సోమవారం కలెక్టర్ ఆఫీస్ నుంచి లారీలో విజయవాడకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎం యాసిన్, ఎఎస్.నాయుడు, రైతు బజార్ ఇఒ ప్రసాద్, మార్కెట్ అసోసియేషన్ సెక్రెటరీ విఎంఆర్.పరమేష్, క్యాషియర్ సత్యనారాయణ, ప్రసాద్ ఎంటర్‌ప్రైజెస్, టెంపుల్ చైర్మన్ కోరిబిల్లి ప్రసాద్, పూర్ణచంద్రరావు, శ్రీను, వైష్ణవి, హోల్ సేల్ మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-సీతమ్మధార : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ద్వారకా పోలీస్‌స్టేషన్ సిఐ డి.వెంకటరమణ స్పష్టం చేశారు. ద్వారక సీఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం తాగి అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు అనవసర విషయాల్లో కలగజేసుకుని, సెటిల్మెంట్లు చేస్తే పీడీ యాక్ట్‌తోపాటు నగర బహిష్కరణ ఉంటుందని స్పష్టంచేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను శాంతియుతంగా విని పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి : సిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పెండింగ్ కేసులు ఏమైనా ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని సిఐ, ఎస్ఐలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం రాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ, కూర్చో బెట్టి సావధానంగా సమస్యలు విని, పారదర్శకంగా విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్‌కు అనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలని సూచించారు. స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్లు అప్డేట్‌గా ఉండాలన్నారు. ఉద్యోగం, కుటుంబ పరంగా సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని కోరారు. నేర విభాగం పోలీస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజ్‌చేసిన, వినియోగంలో లేని వాహనాలు పాడవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పర్యాటక ప్రదేశాలతో పాటు శివారు ప్రాంతాలు, తీర ప్రాంతం ఉన్నందున దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా పోలీసింగ్ చేయాలని, సిసి టివి కెమెరాలు మరిన్ని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని నేర విభాగం అధికారులు, సిబ్బందికి సూచించారు. రౌడీ షీటర్లు, అనుమానితుల ప్రతి కదలికనూ గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండరాదని, అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డైట్‌లో ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సోమవారం ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ, ఎపిలో జాతీయ సగటు కంటే అక్షరాస్యతా శాతం తక్కువగానే ఉందని, నిరక్షరాస్యులైన వారంతా అక్షరాస్యులుగా మారాలని కోరారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేస్తే శత శాతం అక్షరాస్యతను సాధించ వచ్చని స్పష్టం చేశారు.

ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను 7.3 మిలియన్ టన్నుల పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని ఎఐటియుసి, మిత్రపక్షాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఇడి వర్క్ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్ ఎఐటియుసి అధ్యక్షులు కెఎస్ఎన్.రావు మాట్లాడుతూ, ఉక్కు కర్మాగారం పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ముడి సరుకు లేక ఉక్కు ఉత్పత్తి కుంటుపడిందని తెలిపారు. ఉక్కు పరిస్థితిపై యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ముడి సరుకును సకాలంలో రప్పించక పోవడంతో ఉక్కు ఉత్పత్తి పరిస్థితి దిగజారుతూ జీతాలు సమయానికి చెల్లించలేని స్థితికి కంపెనీ వెళ్లిందని తెలిపారు. జీతాల్లో కటింగ్ చేసిన పిఎఫ్ లాంటివి కూడా జమచేయక పోవడం క్షమించరాని నేరమన్నారు. తక్షణమే యాజమాన్యం ముడి సరుకును తెప్పించి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల నెల మొదటి వారంలోనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉక్కు సిజిఎం (వర్క్స్) ఇన్‌ఛార్జి యు.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో జె.రామకృష్ణ, ఎ.మసేనురావు, దొమ్మేటి అప్పారావు, డొక్కా నర్సింగరావు, జెవి.నరేష్‌కుమార్, రామ్‌కుమార్, కె.పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

ఎపిడికి చెక్కును అందిస్తున్న ఎస్ఎల్ఎఫ్ డాక్రా సంఘం సభ్యులు

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 90వ వార్డు పరిధి వినోద్‌నగర్‌కు చెందిన ఎస్ఎల్ఎఫ్ డ్వాక్రా సంఘ సభ్యులు విజయవాడ వరద బాధితులకు రూ.1 లక్ష విరాళాన్ని అందించారు. ఆర్‌పి సంధ్యారాణి ఆధ్వర్యాన సిఒ జగదీశ్వరి సమక్షంలో ఎపిడి శ్రీరామ్‌కు రూ.లక్ష చెక్కును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.అనంతలక్ష్మి, కాకానినగర్ మహిళా నాయకులు లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు. మానవతా దృక్పథంతో ఎస్ఎల్ఎఫ్ డ్వాక్రా సంఘ సభ్యులు, ఆర్‌పిలు చేసిన సహాయాన్ని పలువురు అభినందించారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని అంధత్వ నివారణా సంస్థ జిల్లా చైర్మన్ అధ్యక్షతన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యాన ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హాజరై మాట్లాడారు. 15 రోజులు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షికి అభినందనలు తెలిపారు. డాక్టర్ వి.మీనాక్షి మాట్లాడుతూ, జిల్లాలో పలు చోట్ల నేత్ర దాన అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నేత్ర దానం ఆవశ్యకత, అవగాహనపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలైన వారికి సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర శాస్త్రి, డాక్టర్ జ్యోతిర్మయి, ఆర్ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు

నెల్లిముక్కులో అన్న సంతర్పణ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధి నెల్లిముక్కు లో మంగళంపల్లి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అన్నసంతర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టిడిపి నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో భోజనం పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : స్థానిక సిఎల్‌సి చర్చి ఆధ్వర్యాన శ్రీరామ్‌నగర్‌లో సోమవారం 300 మంది పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. గాజువాక తహశీల్దార్ టి.శ్రీవల్లి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, కె..చంద్రరావు, రాయాన్‌బాబు, సిఎల్‌సి బృందం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గరికపాటి రాజారావు వర్ధంతి

ప్రజాశక్తి- కరాస : ప్రజానాట్యమండలి వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతిని 52వ వార్డు పరిధి శాంతినగర్ హస్మి భవనంలో నిర్వహించారు. రాజారావు చిత్రపటానికి ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ నాయకులు అరుణ్ జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరికపాటి రాజారావు డాక్టర్‌గా వృత్తిని కొనసాగిస్తూ ప్రజల కోసం అనునిత్యం పరితపించేవారని చెప్పారు. అనేక నాటికలు, నాటకాలు, కళారూపాల ద్వారా నిత్యం ప్రజా చైతన్యం కోసం పాటుపడ్డారని కొనియాడారు. జిల్లా అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ, గరికపాటి రాజారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రజా కళాకారులు చైతన్యం తేవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అనేక ప్రజా పోరాటాలు, ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి మద్దతుగా కళాకారులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

నీట మునిగిన పంట పొలాలు పరిశీలన

మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలంలో నీట మునిగిన పంట పొలాలను ఎంపీ సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, డిప్యూటీ తాసిల్దార్ శ్రీరామమూర్తి, మండల వ్యవసాయ అధికారి రంగాచారి వేరువేరుగా సందర్శించి పరిశీలించారు. ఎంపీ సీఎం రమేష్ బొజ్జన్న కొండ వద్ద పొంగిపొర్లుతున్న ఏలేరు కాల్వను పరిశీలించి నీరు ఎప్పటికప్పుడు తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబి, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన శ్రీనివాసరావు ఉన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మార్టూరు, దిబ్బపాలెం గ్రామాలను సందర్శించి రైతులతో పంట నష్టంపై ఆరా తీసారు. ఆయన వెంట తుమ్మపాల ఎంపిటిసి సభ్యులు చదరం నాగేశ్వరరావు, సర్పంచు పీల ఉషా అప్పారావు ఉన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు నాగ జగదీష్, పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కే కే వి ఏ నారాయణరావు ఆవఖండంలో వెంట పొలాలను పరిశీలించారు. మండలంలోని మార్టూరు, బవులు వాడ తుమ్మపాల, వెంకుపాలెం తదితర ప్రాంతాలను డిటి శ్రీరామ్మూర్తి, ఏవో రంగాచారి ఆధ్వర్యంలో సందర్శించి రైతుల నుంచి పంట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

రాంబిల్లి : మండలంలోని నారాయణపురం, పంచదార, మురకాడ శారదా నది వద్ద ఉన్న ఆనకట్ట ప్రవాహ ఉధృతికి గట్లు దెబ్బతిన్న ప్రాంతాన్ని, పంట పొలాలను యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పరిశీలించారు. పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు తగు సూచనలు చేశారు. దిమిలి, వాడనరసాపురం, బంగారం మెట్ట మత్స్యకారులు గ్రామాల్లో కాలవలు, డ్రైనేజీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలో లక్ష్మీపురం, చోడవరం పంచాయతీ పలు ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సోమవారం పర్యటించారు. నీటి ముంపునకు గురయ్యే ప్రాంతాలను శాశ్వత పరిష్కారం చిందేలా నిర్మాణాలు చేపడతామని తెలిపారు. మునిగిపోయిన పొలాలకు, దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం అందేలా అధికారులతో సర్వేలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడీవో ఎస్‌డి శ్యామసుందర్, ఈవో నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కసింకోట మండలంలోని ఏనుగు తుని, ఎన్జీ పాలెం గైతులపాలెం, తాళ్లపాలెం గ్రామాలలో నీట మునిగిన వరి పొలాలను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలు అందేటట్లుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కర్రి సత్యనారాయణ, కలిగేట్ల సింహాద్రి, కర్రి గోవిందా పాల్గొన్నారు.

మునగపాక : మునగపాకలో నీట మునిగిన వందల ఎకరాల వరి పంటలను టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సాయికృష్ణ సోమవారం పరిశీలించారు. దిగాలు పడిన రైతులను ఆయన పరామర్శించారు. ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి నాయకులు దాడి శివ, ఆడారి గోవింద, సరగడం జగన్, పీలా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

కోటవురట్ల : మండలంలో లోతట్టు ప్రాంతాలను తహసిల్దార్ జానకమ్మ పరిశీలించారు. మండల కేంద్రంలో సీతారామరాజు నగర్ కాలనీకి లింగాపురం చెరువు నీరు చేరుకోవడంతో ముంపుకు గురై సమీప ప్రాంత వాసులు ఇబ్బందులు పడ్డారు. తహసిల్దారు జానకమ్మ లింగాపురం గ్రామాన్ని సందర్శించి చెరువు నీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మిగులు నీటిని పొలాల వైపు వెళ్లకుండా సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, జానకి హరి, కసిరెడ్డి ఏసు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని ఏఎల్.పురంలో భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న బొడ్డేరు గెడ్డను గ్రామ సర్పంచ్ లోచల సుజాత సోమవారం పరిశీలించారు. వినాయకుని నిమజ్జనకు ఇబ్బంది కలగకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, విఆర్ఓ సాంబమూర్తి పాల్గొన్నారు.

గొలుగొండ : నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మండలంలోని కె.ఎల్లవరం గ్రామంలో పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో పంట పొలాల వివరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షులు రాంబాబు ఉన్నారు. నర్సీపట్నం అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి రావణాపల్లి, పాకలపాడు, చీడిగుమ్మల, కొత్తమల్లంపేట, లింగంపేట గ్రామాల్లో వర్షాల కారణంగా నీటి ముంపునకు గురైన వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుధారాణి పాల్గొన్నారు.

కె.కోటపాడు : రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని 14 గ్రామాల్లో 205 ఎకరాల్లో పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులు సోమవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. నీరు పోయే మార్గాలను తక్షణమే ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. మండల తహశీల్దారు రమేష్ బాబు, చెరుకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం ఏవో తులసి, స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్, తదితరులు మేడిచర్ల, పైడింపేట, వారాడ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వీరి వెంట ఆయా గ్రామ సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం, నాగయ్యపేట, రైవాడ గ్రామాల్లో పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, డి.అదిలక్ష్మి, వి.చంద్రశేఖర్ బందం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా తాము ఇచ్చిన సలహాలను తూచా తప్పకుండా పాటించాలని వారు కోరారు.

కశింకోట : వరి పంటలలో వర్షం నీరు తీసేయాలని శాస్త్రవేత్తులు తెలిపారు. మండలంలో ముంపునకు గురైన వరి, చెరుకు పంటలను వారు సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరి పొలాల్లో నిల్వ ఉన్న నీరు తీసిన తరువాత యూరియా 25 కిలోలు, ఏం.ఒ.పి 15 కిలోలు కలిపి వేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎన్.రాజ్ కుమార్, ఎన్.సత్తిబాబు,పి. వి. పద్మవతి, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

వాలాబులో ఎమ్మెల్యే బండారు పర్యటన

దేవరాపల్లి : వరదలో చిక్కుకున్న బొర్రచింత గ్రామస్తులను అన్ని విధాల ఆదుకుంటామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని వాలాబు పంచాయతీలో ఎమ్మెల్యే బండారు సోమవారం పర్యటించారు. సరియా జలపాతం గెడ్డ అవతల చిక్కుకున్న 15 మంది గిరిజన కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించారు. బొర్రచింత గ్రామానికి వెళ్లడానికి రోడ్డు లేక ఆ గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు సరియా గెడ్డను ఆయన పరిశీలన చేశారు. వాలాబు రోడ్డు నుంచి బొర్రచింత గ్రామానికి వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణానికి 87 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జలాశయం ప్రస్తుత నీటి నిల్వల పరిస్థితిని డిఈ సత్యం నాయుడుని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, శరఖాన సూర్యనారాయణ, కొమర బాబురావు, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్. చంద్రశేఖరరావు, సీఐ పైడం నాయుడు, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో చేపలు పట్టిన యువకులు

అనకాపల్లి : తుఫాను నేపథ్యంలో కురిసిన వర్షాలకు వాగులు వంకలు చెరువులు నదులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో ఉన్న చెరువుల నుంచి పొంగిపొర్లుతున్న నీటి ద్వారా చేపలు పంట పొలాల్లో చేరాయి. దీంతో యువకులు వలలు, కర్రలు పట్టుకొని చేపల వేటకు బయలుదేరారు. మండలంలోని మార్టూరు గ్రామంలో సోమవారం వరి పొలంలో కొందరు యువకులు చేపల గాలింపు చేపట్టారు. అందిన కాడికి చేతపుచ్చుకొని మధ్యాహ్నం ఘుమ ఘుమ లాడే చేపల కూరకు తయారయ్యారు.

మండలంలో 427 ఎకరాల్లో నీట మునిగిన వరి

అనకాపల్లి : వర్షాలకు అనకాపల్లి మండలంలో 427 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు. ఏడు రోజుల నుంచి 30 రోజుల కాలంలో వేసిన ఈ పంటల ప్రాథమిక నష్టాన్ని మండల వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొత్తం 585 మంది రైతులకు చెందిన 427 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా వేసారు. ఊడేరు గ్రామంలో 130 మంది రైతులకు చెందిన 70 ఎకరాలు, సీతానగరంలో 7 ఎకరాలు(20) కుంచంగి,(15 మంది) తుమ్మపాల గ్రామాల్లో 20 ఎకరాల (30 మంది) చొప్పున, శంకరం 135 ఎకరాలు (160 మంది), రేబాక 40 ఎకరాలు (60 మంది), చింత నిప్పుల అగ్రహారం సుమారు మూడు ఎకరాలు (ఐదు మంది) అనకాపల్లి నార్త్ 32 ఎకరాలు, (45 మంది) అనకాపల్లి సౌత్ 100 ఎకరాలు (120 మంది) వరి పంట నష్టం జరిగినట్టు తెలిపారు. నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్టు మండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు.

ముంపు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ముంపుకు గురైన పెద్దేరు వంతెనను, గండి కొట్టిన విజయరామరాజుపేట తాచేరు కాజ్వేను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సోమవారం పరిశీలించారు. రెవెన్యూ, ఆర్అండ్బి అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. విజయరామరాజుపేట కాజ్వేకి ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా 24 గంటలు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిధులు మంజూరైనా విజయరామరాజుపేట వంతెన నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆర్అండ్బి అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను వెంట పెట్టుకుని కలవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలన్నారు. అధ్వానంగా ఉన్న బంగారుమెట్ట కూడలిలో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చిన్నికృష్ణ, తహశీల్దార్ శ్రీనివాసు, డిటి అరుణ్ చంద్ర, ఎస్ఐ ఈశ్వరరావు ఉన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న వడ్డాది పెద్దేరు వంతెనను, విజయరామరాజుపేటలో గండి కొట్టిన తాచేరు వంతెనను ఆర్అండ్బి ఎస్ఈ క్రాంతిమతి, ఈఈ రమేష్, డిఈ ధనుంజయ్ మంగళవారం పరిశీలించారు. వర్షం తెరిపి ఇవ్వడంతో నీరు ప్రవహిస్తున్న పెద్దేరు కాజ్వే వంతెనపై జెసిబితో తుప్పలు, డొంకలు రాళ్లు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఈ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వర్షం తగ్గిన వెంటనే తాచేరు వంతెన వద్ద తాత్కాలిక పనులు ప్రారంభించి రాకపోకలు పునరుద్ధరిస్తామన్నారు. నర్సీపట్నం- అడ్డురోడ్డు రోడ్డులో 20వ కిలోమీటరు వద్ద పాత ఐరన్‌గడ్డ బ్రిడ్జి డామేజ్ అయిందని, రూ.15 లక్షలతో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. చీడికాడ మండలం కండివరం వద్ద అప్రోచ్ రోడ్డుకి గండి పడిందన్నారు. రావికమతం మండలంలోని దొండపూడి బిఎన్ రోడ్డు వద్ద కల్వర్టు దెబ్బదిందని చెప్పారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న కల్వర్టులు, రోడ్లు తాత్కాలిక మరమ్మతులకు రూ.80 లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

చెరువులో మునిగి పాడి ఆవు మృతి

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో కారి చెరువులో వరద ఉధృతికి నీట మునిగి పాడి ఆవు మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన కండిపల్లి దాలయ్యకి చెందిన పాడి ఆవు ఆదివారం మేతకు వెళ్లి తిరిగి వస్తుంది. వర్షాలు భారీగా కురవడంతో కారి చెరువులోకి గెడ్డ నీరు ఉధృతంగా ప్రవహించడం వలన పాడి ఆవు చెరువులో మునుగిపోవడంతో మృతి చెందినట్లు రైతు దాలయ్య తెలిపారు. పాడి ఆవు సుమారు 70 వేల రూపాయలు విలువ చేస్తుందని దాలయ్య తెలిపారు. దీంతో సర్పంచ్ లావణ్య కన్నం నాయుడు అధికారులకు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన అధికారులు గ్రామానికి వెళ్లి పంచనామా చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

శంకరం వద్ద మదుముల్లో పూడిక తొలగించాలి

ముంపునకు గురైన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

అనకాపల్లి : మండలంలోని బొజ్జన్న కొండ వద్ద జాతీయ రహదారి రోడ్డు కింద ఏర్పాటు చేసిన మధుములు పూడుకు పోయాయని తక్షణమే వాటిని తొలగించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గంట శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లి కొండుపాలెం, చింతనిప్పుల అగ్రహారం, మార్టూరు, శంకరం గ్రామాల మీదుగా బొజ్జన్నకొండ వరకు పులికాల్వ ప్రవహిస్తూ ఏలేరు కాలువ దాటుకొని అనకాపల్లి జీవిఎంసి పరిధి గుండా ఆవకాండం చేరుకొని అక్కడ నుంచి కొండకర్ల ఆవ వరకు ప్రవహిస్తుందని తెలిపారు. కురుస్తున్న భారీ వర్షాలకు బొజ్జన్న కొండ జంక్షన్ దగ్గర ఏలేరు కాలువ పొంగిపొర్లుతుందని, దీంతో అక్కడ గండి కొట్టే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా సబ్బవరం హైవే వేయడంతో హైవేకి 12 కాణాల్లో పది కాణాల్లో మట్టితో పూడుకుపోవడంతో వర్షపు నీరు ముందుకు ఆవఖండం వైపు వెళ్లకుండా ఉండిపోతున్నాయని తెలిపారు. దీని వల్ల వల్ల పంట పంట పొలాలు తోపాటు అనకాపల్లి పట్టణాన్ని ముంచే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మామిడి రమణ, చలపతి, ఏపీ రైతు సంఘం రైతుసంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, బుజ్జి పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించాలి

పొలాలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- మునగపాక

తుఫాన్ కారణంగా మునిగిపోయిన వరి పంటలకు నష్టపరిహారం అందజేసి రైతులను తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి గండి నాయనబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మునగపాక, వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట ప్రాంతాలలో వర్షాల కారణంగా మునిగిన వరి పంటలను సోమవారం వారు పరిశీలించారు. రైతులకు కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి నారు వేసిన దగ్గర నుండి ఉడుపులు వుడిచే వరకు రైతులకు వరుస తుఫానుల కారణంగా పలు మార్లు నష్టాన్ని చవిచూసే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20,000 అందిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పటికీ దానిని అమలు చేయడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులను పంపించి పంట నష్టపరిహారాన్ని లెక్క కట్టి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, రైతులు మద్దాల వెంకట్, పెతకంశెట్టి శివ, సీరం సూరిబాబు, శరగడం అప్పారావు, కర్రి కృష్ణ పాల్గొన్నారు.

వర్షంలోనూ విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

వరద బాధితులకు సిఐటియు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విజయవాడ వరద బాధితులకు సోమవారం ఎస్సీ జెడ్ పరిశ్రమలలో ముఠా కార్మికుల వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు చేస్తున్న సహాయ కార్యక్రమాలు సరిపోవటం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని సహాయ కార్యక్రమాలు చేయడానికి ప్రతిపాదన చేయాలని తెలిపారు. విజయవాడ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన కోరారు. సిఐటియు మరియు ప్రజా సంఘాలు ఇప్పటికే వరదల్లో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు బాసటగా సహాయ కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. విరాళాల సేకరణ కార్యక్రమంలో నానాజీ సత్తిబాబు అప్పలనాయుడు సత్యనారాయణ తాతబాబు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రంలో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో చేపట్టిన పారిశుద్ధ్య పనులు స్థానిక ఎంపీడీవో సువర్ణ రాజు, సర్పంచ్ సుంకర లక్ష్మి పరిశీలించారు. మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా సిసి రోడ్ ముందు భాగంలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో కశింకోట, బంగారు మెట్ట రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మోకాలులోతు నీరు పేరుకు పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న సందర్భంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీరంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడక సముద్ర తీరంలో ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణలను సోమవారం జెసిబి సహాయంతో తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి గ్రామాన్ని సందర్శించారు. ఆమె దృష్టికి ఆక్రమాలను గ్రామస్తులు తీసుకువెళ్లారు. గ్రామంలో సముద్దిరంలో ఎటువంటి ఆక్రమాలు ఉన్నప్పటికీ వాటిని వెంటనే తొలగించాలని ఆమె సూచించారు. ఆమె సూచనల మేరకు ఎంపీడీవో ఈవోపీఆర్డీ గ్రామ పంచాయతీ అధికారులు, స్వయంగా ఆక్రమణల ప్రదేశాలను సందర్శించి గుర్తించారు. వాటిని తొలగించారు.

దేవుడమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పరవాడ : టిడిపి నేత, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ మాతమూర్తి కన్నూరు దేవుడమ్మ శనివారం మరణించడంతో సోమవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు వారి కుటుంబ సభ్యులను కలిసి ఆమెకు నివాళి అర్పించారు. తానాం లోని వెంకటరమణ స్వగృహంలో ఆమె తనయుడు కన్నూరు వెంకటరమణను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పైలా జగన్నాథ రావు, సిరిపురపు అప్పలనాయుడు, చింతకాయల ముత్యాలు, మోటూరు సన్యాసినాయుడు, బుగిడి రామ గోవిందా, వియ్యపు చిన్న, దుల్లా రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేల కూలిన భారీ వృక్షం

వాహనాల రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో చౌడపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలను కూలింది. ఇది రహదారిపై కూలటంతో అనకాపల్లి అచ్యుతాపురం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఈజెడ్ పరిశ్రమలో బి షిఫ్ట్ విధులకు వెళ్లే కార్మికులకు తిరిగి వస్తున్న కార్మికులకు ఇబ్బందులు పడ్డారు. సమస్య తెలుసుకున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, ఆర్ అండ్ బి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కూలిన చెట్టును తొలగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెట్టును తొలగించారు. రాకపోకలకు అనుకూలంగా ప్రధాన రహదారిని క్లియర్ చేశారు.

పాఠశాల శానిటేషన్ వర్కర్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళాశాలలు పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, ఉన్నత పాఠశాలలకు అదనంగా సిబ్బందిని నియమించాలని, శానిటేషన్ పరికరాలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి దయానిధికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, యూనియన్ అధ్యక్షురాలు కరణం శివలక్ష్మి మాట్లాడారు. కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అలాగే ఉన్నత పాఠశాలలో సుమారు 300 మంది వరకు విద్యార్థులు ఉంటున్న నేపథ్యంలో అదనంగా వర్కర్స్ ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ఎం శ్రీదేవి, జిల్లా కార్యదర్శి పిల్లి జానకి, అధిక సంఖ్యలో వర్కర్స్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాఠశాల శానిటేషన్ కార్మికులు

నిబంధనలు పాటించని సాయి కుల్వంత్ యాజమాన్యం

చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి : తుఫాన్ కారణంగా జిల్లా కలెక్టర్లు సోమవారం జిల్లాల్లో విద్యాసంస్థలు సెలవు ప్రకటించినా నిబంధనలకు పాటించకుండా సాయి కుల్వంత్ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను భయపెట్టి క్లాసులు నిర్వహించింది. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం సెలవు ప్రకటించింది ప్రభుత్వం. దానిని లెక్కచేయకుండా ఆ కళాశాల యామాన్యం తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వర్షంతో కళాశాల హాజరు కావాల్సి వచ్చింది. ఎస్ఎఫ్ఐ బందం కళాశాలకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బేకాతరు చేస్తున్నారన్నారు. దీనిపై ఇక్కడ ఉన్న విద్యాశాఖ అధికారులు కనీస పర్యవేక్షణ చేసి వారిపై తగు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. స్థానిక డిఐఇఒ అధికారిని సుజాతకి ఎస్ఎఫ్ఐ సమాచారం ఇచ్చినప్పటికీ సాయి కుల్వంత్ కళాశాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. విద్యార్థులు ప్రాణాలతో చెలగాటమాడటం తగదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని ప్రైవేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎస్.నాగ రమణ, డివిజన్ అధ్యక్షులు కే వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశం ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలందరికీ అందుబాటులో అధికారులు ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఎటువంటి అపరిశుభ్ర పరిస్థితులులేకుండా, అంటువ్యాధులు ప్రబలటానికి ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీలలో నూతనంగా పనులు చేయడానికి ప్రతిపాదనలు చేస్తూ, పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సభ తీర్మానం చేసింది. పలు శాఖలపనితీరుపై ఎమ్మెల్యే రమేష్ బాబు సమీక్షించారు. అభివద్ధి కార్యక్రమాలపై దష్టి పెట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులకు ఏ సమస్యలు ఉన్నా ఎంపీడీఓ, ఎంపీపీ దష్టికి తీసుకురావాలని, తక్షణమే ఆ సమస్య పరిష్కరానికి కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో హేమ సుందరరావు, ఎస్డిపిటి సత్యనారాయణ, సర్పంచ్లు, ఎంపిటిసీలు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-సబ్బవరం : ఇటీవల భారీ కురుస్తున్న వర్షాల నుంచి ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కోనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలకు పంట నష్టం వాటిల్లినా, పశునష్టం, ప్రాణనష్టం జరిగినా ప్రభుత్వం పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మేహాద్రి గెడ్డ పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతాలలో ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ గేట్లు ఎత్తి వేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు కారణంగా కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఆక్రమణలు తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్య కుమారి, ఎంపీడీఓ రమేష్ నాయుడు, డి టి వెంకట్, పలు శాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి - వడ్డాది : రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన అభివద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ధ్యేయంగా సాగిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిలా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు అన్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును అరెస్టుకు ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీ, చట్టబద్ధత, పారదర్శకత చంద్రబాబు ప్రత్యేకత, అందుచేతనే చంద్రబాబును అక్రమ అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరు ఖండించారని, అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని తెలిపారు. విడుదలైన రోజు రాజమండ్రి నుండి విజయవాడ చేరడానికి రాత్రంతా జనం రోడ్లపై జాగారం చేసి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారన్నారు. ఏలాంటి అవినీతికి పాల్పడకపోయినా ఆధారం లేకపోయినా అక్రమంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ఈ క్రమంలో కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు దొండ నరేష్, రమేష్, సాయం శేషు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి - పరవాడ : వరద బాధితుల సహాయనిధికి రక్షిత్ డ్రగ్స్, సాయినార్ కంపెనీలు సంయుక్తంగా రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఈ చెక్కులను రక్షిత్ డ్రగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రామేశ్వరరావు సోమవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్‌కు అందజేశారు. ప్రభుత్వం పిలుపు మేరకు ఈ నిధి సామాజిక బాధ్యతలో భాగంగా అందజేశామని ఆయన పేర్కొన్నారు.

బాధితురాలికి యువకుల సహకారం

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలో గల సీతయ్యపేట గ్రామంలో గల యువకులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలి కుటుంబానికి సోమవారం సాయం అందజేశారు. గ్రామానికి చెందిన నానిపల్లి దుర్గమ్మ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామంలో కొంతమంది యువకులు చందాలు రూ.41900 సాయాన్ని దుర్గమ్మ కుమారుడు నానికు అందించారు. మెరుగైన వైద్యం కొరకు వాడుకోవాలని సీతయ్యపేట యూత్ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన యూత్ కమిటీ సభ్యులను గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా, శ్రీను, వజ్రపు బాబురావు, రాజుబాబు కరణం నాగేశ్వరరావు, అభినందించారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి - కె.కోటపాడు : వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మేజర్ పంచాయతీ చౌడువాడలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో అధికారుల బందం గ్రామాల్లో నీరు నిలువ లేకుండా బయటకు వెళ్లే మార్గాలను జెసిబి యంత్రాలతో తవ్వించారు. మండలంలోని చిట్టిగడ్డ, పెద్దగడ్డ ఉధతంగా ప్రవహిస్తున్నాయని సమీప ప్రాంతాల ప్రజలు ఆ నీటిలో దిగరాదని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎటువంటి ప్రాణనష్టం ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. గ్రామాల్లో దోమలు విజృంభించకుండా బ్లీచింగ్, ఫినాయిల్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, ఆర్‌డిడబ్ల్యుఎస్ ఏఈ శ్వేత, కార్యదర్శి రామానాయుడు తదితరులు ఉన్నారు.

జిల్లా ఎస్‌పికి 10 ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదులన్నిటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దీపిక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్ రావు, ఎస్సై దివ్య పాల్గొన్నారు.

ఒంటి కాళ్లపై నిరసన

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆసుపత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 9రోజుగా చేస్తున్న నిరసన సోమవారం నల్ల బ్యాడ్జి ధరించి ఒంటి కాళ్లపై తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోన లక్ష్మణ, అప్పలరాజు, చిన్న రమణమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, దేవుడమ్మ,రాజు పాల్గొన్నారు.

వరదలతో విలవిల

- నీట మునిగిన వరి పంటలు- జల దిగ్బంధంలో గిరిజనులు
-ఉధృతంగా ప్రవహిస్తున్న తాచేరు, పెద్దేరు - నిలిచిన రాకపోకలు

నక్కపల్లిలో నీట మునిగిన వరి పంట

ప్రజాశక్తి -నక్కపల్లి:తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో వరి పంట నీట మునిగింది. ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట ప్రాంతాల్లో ఆవ నీరు ప్రవాహంతో వరి పంట నీట మునిగింది. తహసీల్దార్ అంబేద్కర్, వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. టిడిపి నాయకులు వైబోయిన వెంకటరమణ, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు వచ్చినప్పుడు ఆవ నీరు ప్రవహించడంతో ఈ ప్రాంతంలో వరి పంట నీట మునుగుతుందని, వరి పంట ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. గునుపూడిలో కూడా వరి పంట నీట మునిగింది. సుమారుగా 380 ఎకరాల వరకు వరి పంట నీట మునిగినట్లు అధికారులు వెల్లడించారు. వైకాపా నాయకులు వేసిన రామకృష్ణ రైతులతో కలిసి ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు .

జల దిగ్బంధంలో మామిడిపాలెం గిరిజనులు

మాడుగుల: మండలంలో శంకరం పంచాయితీ మామిడిపాలెం గ్రామ గిరిజనులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారని, వారిని ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట. నరసింహమూర్తి కోరారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ, మాడుగుల మండలం శంకరం పంచాయతీలో గిరిజన గ్రామమైన మామిడిపాలెం గిరిజన గ్రామానికి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా శంకరం ఉరకగడ్డ రిజర్వాయర్ నుండి ఉరకగెడ్డ నీరు ఎక్కువగా రావడంతో గిరిజనులు గెడ్డ దాటలేక రెండు రోజుల నుండి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. మామిడిపాలెం గ్రామానికి రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. అకాల వర్షాలకు ఉరకగెడ్డ నీరు పొంగి నప్పుడు గ్రామస్తులంతా నిత్యావసరసరకులు లేక ఆకలితో వస్తులు ఉండవలసి వస్తుందని తెలిపారు. ఆ గ్రామంతో పాటు తాటిపర్తి పంచాయతీలో ఆజయపురం, జాలంపల్లి పంచాయతీలో గొప్పూరు, సిరిపురం, ఆవురువాడ పంచాయతీలో కొండవీది, పెద గొర్రెగెడ్డ, చిన గొర్రెగెడ్డ గ్రామాల వారు మాడుగుల సంతకు వచ్చి సామాన్లు తీసుకు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో గిరిజనులు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే మామిడిపాలెం గిరిజన గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేసి రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉండూరు ఈశ్వరరావు, తార దేముడమ్మ, దారపర్తి బాలరాజు, సోమల నూకాలమ్మ గ్రామస్తులు ఉన్నారు.

దిక్కు తోచని స్థితిలో మామిడిపాలెం గిరిజనులు

రాకపోకలు బంద్

నర్సీపట్నం టౌన్:రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నర్సీపట్నం డిపో నుండి వెళ్లే కొన్ని బస్సులను రద్దు చేశారు. నర్సీపట్నం నుండి తుని వెళ్ళాలంటే నాతవరం మండలం దాటుకుంటూ వెళ్ళాలి. ముఖ్యంగా గన్నవరం మెట్ట గ్రామం వద్ద ఉన్న గెడ్డ ప్రమాదకరంగా పొంగి ప్రవహిస్తుండటంతో నర్సీపట్నం నుండి కోటనందూరు, తుని వెళ్ళే బస్సులను నిలిపి వేశారు. టౌన్ పోలీసులు బలిఘట్టం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. నర్సీపట్నం -ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వెళ్ళే బస్సులను నిలిపి వేశారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం వద్ద వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా నర్సీపట్నం -చోడవరం రహదారిలో వడ్డాది వంతెన వద్ద నది ప్రమాదకరంగా ఉన్న కారణంగా నర్సీపట్నం నుండి వడ్డాది వరకు మాత్రమే బస్సులు వెళ్తున్నాయి. నర్సీపట్నం నుండి చింతపల్లి రహదారి తురబాల గెడ్డ వద్ద గెడ్డ ప్రమాదకరంగా ఉంది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. నర్సీపట్నం నుండి ప్రయాణం చేసేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.ప్రయాణికులు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. వాతావరణాన్ని బట్టి బస్సులు పునరుద్దరణ చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని డిపో మేనేజర్ ధీరజ్ తెలిపారు.

గొలుగొండలో ప్రవహిస్తున్న గెడ్డ

పొంగి ప్రవహిస్తున్న దారగెడ్డ

గొలుగొండ: మండలంలోని చిట్టింపాడు వెళ్ళే రోడ్డులో దారగెడ్డ పొంగి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. గొలుగొండ ఎస్సై రామారావు ఆధ్వర్యంలో గస్తీ ఏర్పాటు చేశారు.

ఒడ్డుకు చేరిన పడవలు

నక్కపల్లి:తుఫాన్ ప్రభావం కారణంగా మత్స్యకారులు వేటకు వెళ్లకపోవడంతో పడవలు, ఇంజన్లు ,వలలు సముద్రపు ఒడ్డుకు చేరాయి. గత వారం, పది రోజుల నుంచి తుఫాన్ నేపథ్యంలో అధికారులు మత్స్యకారులను అప్రమత్తం చేశారు.మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. దీంతో మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు, దొండవాక ,బంగారమ్మ పేట తదితర గ్రామాల్లో మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లకుండా పడవలను ,ఇంజన్లు ,వలలను సముద్రం ఒడ్డుకు చేర్చారు. మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

చీడికాడలో దెబ్బతిన్న కల్వర్టు

చీడికాడ: వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చీడికాడ మండలం కండివరం- వి.మాడుగుల మధ్యలో ఉన్న మోసూరు వారి కల్లాల వద్ద కల్వర్టు కొట్టుకు పోయింది. కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ నరసింహమూర్తి కోరారు. కల్వర్టు దెబ్బతినడంతో కండి వరం నుండి మాడుగుల వచ్చే ప్రయాణికులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న తాచేరు, పెద్దేరు
నీట మునిగిన పంట పొలాలు

వడ్డాది: గత మూడు రోజులగా కురుస్తున్న వర్షాలకు బుచ్చెయ్యపేట మండలంలోని పెద్దేరు, తాచేరు నదులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో వడ్డాదిలోని పెద్దేరు కాజ్వే ముంపునకు గురైంది. వంతెన పైనుండి నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డుకి భారీ గండి పడింది. గత నాలుగు రోజుల నుండి బిఎన్ రోడ్లో చోడవరం- వడ్డాది మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పలు గ్రామాలలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి.

నీట మునిగిన వరి పొలాలు

చోడవరం : తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో నర్సాపేట లక్ష్మీపురం, అంకుపాలెం, పిఎస్ పేట, గన్నవరం లోతట్టు ప్రాంతాల్లో వరి పంట నేటి మునిగింది. లక్ష్మీపురం చెరువులో నీరు ఎక్కువ కావడంతో దాని నుండి బయటకు వస్తున్న నీరు కింది గ్రామాల వరి పంటలో నీట మునిగాయి. అధికారులు తమ పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అచ్యుతాపురం : ఎడతెరిపి లేని వర్షాలకు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షంతో జగ్గన్నపేట, కాజీ పాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట, ఉప్పవరం తదితర గ్రామాలలో వరి పంట నీట మునిగింది. నీటి ప్రవాహం ఎక్కువైతే నీటిలోనే వరి పంట కుళ్ళిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పంటలు మునిగిపోకుండా జగ్గంపేట గ్రామ రైతులు కల్వర్టు వద్ద పెరిగిపోయిన చెత్తాచెదారాన్ని క్లియర్ చేశారు. భారీ వర్షాలకు మండలంలోని తంతడి శివారు వాడపాలెంలో సముద్ర తీరాన గెడ్డ వాగు పొంగి ప్రవహిస్తుంది.

అనకాపల్లి : తుఫాను కారణంగా కురిసిన వర్షానికి అనకాపల్లి పట్టణం ఆవ ఖండంలో సుమారు 1200 ఎకరాల్లో వరి పంటలు నీట మునిగాయి. మార్టూరు, దిబ్బపాలెం గ్రామాల్లోనూ పంటలు మునిగిపోయాయి.

కశింకోట : భారీ వర్షాల కారణంగా మండలంలో తాళ్ళపాలెం వారపు సంతకు కొంత అంతరాయం ఏర్పడింది. కొనుగోలుదారుల, అమ్మకందారులు ఇబ్బంది పడ్డారు. అయితే మధ్యాహ్నం తరువాత వర్షం ఆగడంతో సంత సాగింది. మేకలు, గొర్రెలు అమ్మకాలు కాకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు.

వడ్డాదిలో వంతెన పై నుంచి ప్రవహిస్తున్న నీరు

అచ్యుతాపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

నిమజ్జనంలో సూచనలు పాటించాలి

ప్రజాశక్తి -కొత్తకోట:వినాయక నిమజ్జన సమయంలో చెరువులు, వాగులు దగ్గర నీటి ప్రవాహం ఎక్కువగా వున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కొత్తకోట సర్కిల్ పరిధిలో కొత్తకోట, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట నాలుగు పోలీసు స్టేషన్ల పరిధిలో వినాయక నిమజ్జనంలో పోలీస్‌లు ఇచ్చే సూచనలు తప్పక పాటించాలన్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు ఎక్కువగా పడుతున్న దృష్ట్యా రిజర్వాయర్, చెరువులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న రాజేష్ దంపతులు

లత్సాపాత్రుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తాతయ్య రుత్తల లత్సాపాత్రుడు వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్, ఆయన సతీమణి దివ్య రాజేష్, లత్సాపాత్రుడు కుమార్తెలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. లత్సాపాత్రుడు జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడుతూ కుటుంబ సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాట్లాడుతున్న పశు వైద్యాధికారి

పశు వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - చీడికాడ:గత నాలుగు రోజులుగా తుఫాన్ కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పశు వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని పశు వైద్యాధికారి ఏవీఎస్ రాఘవమ్మ సూచించారు. మండలంలోని జి కొత్తపల్లి గ్రామం సచివాలయంలో వర్షాలపై సచివాలయం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవమ్మ మాట్లాడుతూ, మూగజీవాలకు ఏదైనా ప్రాణ నష్టం జరిగితే గ్రామ పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం తెలియజేయాలని ఆమె తెలిపారు వర్షాలకు పశువులకు, కోళ్లకు వ్యాధుల శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరి నాయుడు, మాజీ సర్పంచ్ పైడం నాయుడు, సచివాలయం సిబ్బంది గ్రామ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు

కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ శిరీషా రాణి

సంపద కేంద్రాన్ని తనిఖీ చేసిన డిపిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డిపిఒ శిరీషా రాణి, డిపిఆర్‌సి నాగలక్ష్మి పరిశీలించారు .గ్రామాల్లో తడి పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలించి సంపద సృష్టించుకోవాలన్నారు. పారిశుద్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అండర్ -16 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో

టి.అర్జాపురం విద్యార్థుల ప్రతిభ

- ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -కొత్తకోట: ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటిన్ పోటీలలో అండర్ -16 విభాగంలో బాలు రు, బాలికల విభాగంలో టి.అర్జాపు రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని పాఠశాల హెచ్ఎం కెఆర్ఎస్ నాయుడు తెలిపారు సోమవారం ఆయన తెలిపిన వివరాలు మేరకు... ఈనెల 8న గోపాలపట్నంలో జిల్లా స్థాయి బాల్ బాడ్మింటిన్ పోటీలు నిర్వహించారన్నారు.. ఈ పోటీలలో బాలుర జట్టు ద్వితీయ స్థానం, బాలికలు జట్టు తృతీయ స్థానం సాధించారని చెప్పారు..అలాగే రాష్ట్ర స్థాయి జట్టుకు బాలుర విభాగంలో రాము, దుర్గాప్రసాద్ ఎంపిక కాగా బాలికల విభాగంలో శృతి ఎంపికయ్యిందని తెలిపారు. ఈ నెల 13,14,15 తేదీలలో తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లా అన్నవరం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ రమేష్ నాయుడు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ఎంపీపీ భవాని ప్రసాద్, గ్రామ సర్పంచ్ మడగల అర్జున అభినందించారు.

దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అప్పలరాజు

ఘాట్ రోడ్డు పనులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి -కోటవురట్ల: కోతకు గురవుతున్న ఇందేసమ్మ ఘాట్ రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన మొదలు పెట్టి పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఘాట్ రోడ్డు వద్ద కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం డివిజన్ కేంద్రానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారని, అధికారులు, నాయకులు తక్షణమే పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో జనజీవనం స్తంభించి అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, రైతులు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రధానంగా హెట్రో, బ్రాండిక్స్, సహా వివిధ కంపెనీలకు వెళ్లే కార్మికులు ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. రామచంద్రపురం వద్ద కల్వర్టు పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా వివిధ నదుల పరివాహక ప్రాంతాన్ని పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యనారాయణ, రాజేష్, పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనవాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్, నాయకులు గోవింద రావు స్వీకరిం చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనవాణి కార్యక్రమం చేపట్టామని ,ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపమాక పంచాయతీ జనసేన పార్టీ ప్రెసిడెంట్ పామ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున నివదత్

లోతట్టు ప్రాంతాల ప్రజలను..

పునరావాస కేంద్రాలకు తరలించాలి

- హోంమంత్రి వంగలపూడి అనిత - వరదలపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్ ప్రభావంతో రాష్ట్రం అతలాకుతలమైందని, ఇటువంటి సమయములో సీఎంగా చంద్రబాబు నిరంతరం పని చేస్తున్నారని హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట - తుని తాండవ నదిని పరిశీలించామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరా వవాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు నక్కపల్లి లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చెరువులు, వాగులు, నదీ ప్రవాహ ప్రాంతాలను సర్వేలు చేయించడం జరుగుతుందని ,ఆక్రమణ చేపడితే తొలగిస్తామన్నారు .వరదల సమయంలో ప్రజలకు సేవలు చేయకుండా జగన్మోహన్ రెడ్డి బెంగళూరు వెళ్ళాడని ,పాస్ పోర్టు వస్తే లండన్ వెళ్లేవాడన్నారు. గుడివాడ అమర్నాథ్ విశాఖలో కూర్చుని నోటికి వచ్చినట్లు మాట్లాడడం కాదని విజయవాడ వచ్చి వరద బాధితులకు సహాయం చేసి చూపించాలన్నారు.రోడ్డు మీదకి వచ్చి పులిహెూర,వాటర్ ప్యాకేట్ ఇవ్వని వారు కూడా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ప్రకాశం బ్యారేజ్ బోట్లు విషయంలో కుట్రకోణం దాగి ఉందన్నారు .దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి అనిత

నక్కపల్లి: పాయకరావుపేట తాండవ నది, లోతట్టి ప్రాంతాలను హెూంమంత్రి వంగలపూడి అనిత సోమవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో గల ప్రజలతో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాసాలకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. పాండురంగ స్వామి ఆలయం వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న మహిళలతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణిలు, రోగులను సమీప పీహెచ్‌లకు తరలించాలన్నారు.

200 కోట్లతో రోడ్డు పనులకు ప్రతిపాదనలు..

కోటవురట్ల: మండలంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. కోతకు గురవుతున్న ఇందేసమ్మవాక, రామచంద్రపురం శిథిలమైన వంతెనను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలిసి ఆమె పరిశీలించారు.ఇందేసమ్మ వాక ఘాటు రోడ్డు వద్ద రిటైనింగ్ వాలు నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. రామచంద్రపురం వద్ద శిథిలమైన వంతెనను పరిశీలించి త్వరితగతిన డైవర్షన్ రోడ్డు పనులు పూర్తిచేసి రహదారిని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. నర్సీపట్నం అడ్డురోడ్డు నిర్మాణానికి 200 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. మండలంలో జల్లూరు వంతెన పనులు పూర్తికా వస్తుందని, పందూరు వంతెన పనులు టెండర్ ప్రక్రియ పూర్తికాగానే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిఓ జయరావు, తహసిల్దారు జానకమ్మ, జిల్లా టిడిపి కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అధికారులతో రివ్యూ

నక్కపల్లి: నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పి దీపిక అధికారులతో వరదలపై రివ్యూ నిర్వహించారు.హెూం మంత్రి అనిత శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా వ్యవసాయ అధికారి బి మోహనరావు, ఇన్చార్జి డివిజనల్ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలోని 24 మండలాల్లో 3500 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి, నీటిపారుదల శాఖ, వైద్యం, పంచాయతీ శాఖల అధికారులతో మాట్లాడారు కోటవురట్ల మండలం టిడిపి నాయకులు లాలం కాశీనాయుడు ,జానకి శ్రీను రామచంద్రపురం వద్ద బ్రిడ్జి, ఇదేసమ్మ వాక వద్ద రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయని హెూం మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రామచంద్రపురం బ్రిడ్జి నిర్మాణ పనులు సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనిత అధికారులతో మాట్లాడారు. ఇందేసమ్మ వాక వద్ద రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్.రాయవరం మండలంలో నెలకొన్న సమస్యలను ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు అబద్ధం అనిత దృష్టికి తీసుకువెళ్లారు. సోమదేవపల్లి, వమ్మవరం, లింగరాజుపాలెం తదితరు గ్రామాల్లో వరద నీరుతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు . అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు.కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 7013156554 ను వెల్లడించారు .ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ జయరాం, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, డిపిఓ శిరీషా రాణి, పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు చిట్టిబాబు ,కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, లక్ష్మణరావు ,నాగేశ్వరరావు, శాంతి, వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

కాంట్రాక్ట్ నర్సుల నిరసన

విశాకలో ఆందోళన చేస్తున్న నర్సులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని కెజిహెచ్ క్లాక్ టవర్ వద్ద కాంట్రాక్ట్ నర్సులు సోమవారం చేపట్టిన నిరసనకు తెలుగు శక్తి సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ,సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జివో 115 ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిహెచ్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11,500 మంది నర్సులు (మేల్,ఫీమేల్) కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల కారణంగా సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు ఎంపిహెచ్‌డబ్ల్యు పేరుతో నామమాత్రపు శిక్షణ ఇచ్చారన్నారు. వారు ఎంత శిక్షణ పొందినప్పటికీ నర్సింగ్ లో డిగ్రీ, పిజీ,పి హెచ్ డి చేసిన వారితో సమానంగా నాణ్యమైన వైద్య సేవలను ఎఎన్ఎంలు అందించలేరని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం వైసిపి హయాంలో శిక్షణ పొందిన 2,112 మంది సచివాలయ ఎఎన్ఎంలకు రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వర్తించేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జి. శాంతమ్మ, బి.శాంతి కుమారి, డాక్టర్ పప్పూర్ నికుంజ్, వి.వెనిలా, ఎస్.వరలక్ష్మి, ఎన్. శోభారాణి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

గొలుగొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సుల పోస్టుల్లో సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెంబరు 115 ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరిప్రవీణ్‌కు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ నెల 4న 115 జివోను విడుదల చేసిందన్నారు. 15 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలోనే నియామకాలు జరుగు తున్నాయని చెప్పారు. పదేళ్ల నుంచి రెగ్యులర్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.

గొలుగొండలో సమ్మె నోటీసు ఇస్తున్న నర్సులు

విశాఖ నుంచి వరద బాధితులకు సరుకులు

- జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం నుంచి విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, నగరంలోని అన్ని రైతు బజార్ రైతులు, వ్యాపారులుబ ,జ్ఞానాపురం న్యూ హెూల్సేల్ మార్కెట్ వ్యాపారులు సహకారంతో 10.5 మెట్రిక్ టన్నుల కూరగాయలు, నిత్యావసర సరుకులు సేకరించి ప్రత్యేక వాహనాల్లో సోమవారం పంపించారు. కలెక్టరేట్ లో ఈ వాహనాలను జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ చేతుల మీదగా పచ్చ జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్, ఎస్టేట్ అధికారి జి.ప్రసాద్, టి.వై. నాయుడు, వ్యాపారులు వి.పరమేశ్వరరావు, ప్రసాద్. పి.సత్యనారాయణ,శ్రీను పాల్గొన్నారు.

సరుకుల సరఫరా వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

పర్యాటక ప్రాంతాలు మూసివేత

ప్రజాశక్తి -అరకు లోయ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అరకులోయ ప్రాంతంలోని భారీ వర్షాలు కురుస్తుండడంతో అరకులోయ ప్రాంతంలోని పర్యాటక సందర్శింత ప్రాంతాలన్నీ మూసి వేశారు. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్న విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో పర్యాటకులు ఇక్కడికి వచ్చి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీలుగా సందర్శిత ప్రాంతాలైన జన సంస్కృతిక మ్యూజియం పద్మావతి ఉద్యానవన కేంద్రం, చాపరాయి జలపాతం వంటి సందర్శిత ప్రాంతం తో పాటు ఐటీడీఏ పరిధిలోని సందర్శిత ప్రాంతాలన్నీ మూసివేయాలని పాడేరు ఐటిడిఎ అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. నిర్వాహకులు ఆది, సోమవారాల్లో సందర్శిత ప్రాంతాలు పూర్తిగా మూసి వేశారు. ఐటిడిఏ పీఓ నుంచి ఆదేశాలు వచ్చేవరకు తెరవబోమని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని అరకు సందర్శించే పర్యాటకులు గమనించాలని వారు కోరారు. ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తుండడంతో పర్యాటకుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. వచ్చిన కొద్ది మంది కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో తిరుగు ముఖం పట్టారు. దీంతోపాటు అరకు విశాఖ ఘాట్ రోడ్ లో కొండ చరియల భయంతో ఆర్టీసీ బస్సులు కూడా పూర్తిస్థాయిలో నడపలేదు.